# స్వప్నవీధి

శ్రీ కాదంబరి
వెంకటేశ్వరరావు

"మంగీ.............మంగీ యేంచేస్తున్నావ్ బేగీరా"...........

"యేంట్రు అత్తమానము ఒకటేగోల. కూడుడు కుతూంది అలాగొచ్చేనంటే మాడిపోతాది. ఆ సోదేంటో చెప్పకూడదు" అంది మంగి వంటయింట్లోంచి. "యేం బేగిరాయేం. యెర్రిమొకమ. నీకేమి తెలుసు, సూడుమజా, యేం. యినపట్టములే" అన్నాడు వెంకడు తేగలు పాత్ర తవ్వుతూ! "సంపేత్తున్నావు, కాసేపు కూసోనివ్వవు. యేం కొంపమునిగినాది" అంటూ చరచరా భర్తను సమీపించింది మంగి. "మాట్లాడకు నింపాది సూడుసూడు అదృష్టం. భగవంతుడు సల్లని సూపులు మనమీదికిసిరేడు. సూదుకానిగా, యీయేల నుంచి నీవేలాగుంటావో. రాణిలాగుండుగాని నే రాజులాగుంటా. సూత్తావేంటి యెర్రిమొకం. మా లచ్మి యీయాల కరునించి మనింటికొచ్చింది. మాటాడకు బేగెల్లి కోడిపెట్టని, సూరాకత్తిని పట్టురా, మా లచ్మికి బలివ్వాల..........." యేంటావు నాకేమీ తెలీ లేదు. డబ్బుదొరికిందా! ఆ ఆ నిజమేనా! యెంత భాగ్య దీనితోటి మనకట్టాలన్ని గట్టెక్కుతాయీ! బేగ లెక్కెట్టు యెవరైనా సూడగలరు.........

*    *    *

వెంకడికి గడచిపోయిన జీవిత భాగంలోని కష్టాలు అతని మానసిక నేత్రాలకు తెరమీద బొమ్మలులాగు కనిపించేయి. కష్టాలుతోటే అతని జీవితం సగం గడిచిపోయింది. పుట్టినలాగాయితు సుఖము యెరుగడు. యవ్వనమంతా కామందులకు యుపచారాలతోటే గడిచిపోయింది. వృద్ధాప్యం వచ్చేసరికి జీవితయాత్ర ముగియటానిక్కి ఆధారములేదు కట్టుకున్న భార్యతప్ప. ఇప్పుడు అప్రయత్నంగా తలవని తలంపుగా భగవంతుని కృపవల్ల లక్ష్మి తోసుకువచ్చిపడితే అతని జీవితపరిణామం యెట్లుంటుందో చెప్పడానిక్కి అలవికాదు. అకస్మాత్తుగా తేగలు పాత్రలో దొరికిన ధనాన్ని చూచి తనకీజన్మలో ఒక మహత్తరమైన దశ పట్టిందని పొంగిపోతున్నాడు. కాని భాగ్యము అస్థిరమని తెలియదు. తనబోటి భాగ్యశాలి యింక లేడని తనలో తానువిర్రవీగుతున్నాడు. "ధనమూలమిదంజగత్" అన్నారు కదా. పూటకు గతిలేని వాడికి సిరికలిగితే భూమిమీద సరిగా నడుస్తాడూ! యెక్కడలేని గర్వముకలుగుతుంది. అలాగే మన వెంకడి సంగతికూడా అయింది. ఐశ్వర్యంతోపాటు పేరుకూడా మారిపోయింది. యిప్పుడు అతన్ని "వెంకయ్యగారు" అతని భార్యను "మంగమ్మగారు" అని పిలుస్తారు. ఆ వూరికి వెంకడు పెద్దయ్యాడు. ఏ తగువు జరిగినా అతడే తగువుతీర్చాలి........వెంకయ్యగారు కొంత డబ్బు ఖర్చుపెట్టి ఒక పెద్ద మేడ కట్టించేరు. ఆ మేడకు "లక్ష్మీవిలాస్" అనే పేరుపెట్టేరు. ఒక శుభముహూర్తాన్ని వెంకయ్యగారు బంధుమిత్ర సకుటుంబసహితంగా గృహప్రవేశం చేసేరు. చుట్టుప్రక్కల తన కులస్థులనందరినీ విందుకుపిలిచేడు. కావల్సినంతమంది దాసదాసీలు. అతని యిల్లెప్పుడూ కన్నుల పండువులా వుంటుంది. ఏ వార్తాపత్రికలలో చూసినా ఏ వార్త విన్నా వెంకయ్యగారిపేరే మారుమ్రోగుతోంది. 'ఓహోహో ఎంత దయాస్వభావులండీ. వారి జనోద్ధరణానికై సాక్షాత్ భగవంతునిలా వెలసేరు మా వెంకయ్యగారు. నిరాడంబరజీవి, నిత్యసత్యవ్రతుడు, అకళంకమూర్తి'' అంటూ పొగిడేవారు వాళ్ళకులపెద్దలు. ఆ వూరి పంచాయతీబోర్డు ఎలక్షనల్లో వెంకయ్యగారిని అభ్యర్థిగా నిలబెట్టేరు. మనిషిలో మహత్తులేకపోయినా ధనమహిమవల్ల గెలిచేరు. రానురాను ఆ వూరికి ప్రెసిడెంటుకూడా అయ్యారు. ఇప్పుడు వెంకయ్యగారి టీవికి హద్దులేదు. ఆయన కొంత డబ్బు ఖర్చుపెట్టి పూలతోటలు వేయించేరు. సాయంకాలంకాగానే ఉద్యానవన విహారాలకు బయలుదేరేవారు అనుచరులతోటి. యీలా చాలాకాలం జరిగిపోయింది.

*    *    *

కాలచక్రం గిర్రున తిరుగుతోంది. దాంతోపాటు వెంకయ్యగారి పరివర్తనకూడా మారిపోతోంది. అతని పరివర్తన రానురాను జాతిమతభేదాల్లోకి పరిణమించింది. అగ్రజాతులంటే అసూయత కలిగింది. ఏలాగైనా అగ్రజాతులవారిని తనచేతులో కీలుబొమ్మలా

చేసుకుందామనుకున్నాడు. చేయకలడుకూడాను. తగిన సమర్థుడే..................."ఒక రోజున చిన్న కేసు ఒకటి తీర్పుచెపుతూ ఒక బ్రాహ్మణ్ణి యిలా అన్నాడు. "ఏవయ్యా! నీవు బేపనోడవుకావూ? నీకు తెలివిలేదూ యీ విషయంలో ఒక పశువులాగ సంచరించేవే. ఎందుకు నీకీజంధెము, తీసి పారేసెయ్యి. మా పెంపుడుకుక్క మెళ్ళో తగిలించు. పది రూపాయిలు జుల్మానావేసేను నాల్గురోజుల్లో తీర్చుకో" అన్నాడు. అల్పునకు అధికారమిచ్చినా, ఆడదానికి పెత్తనమిచ్చినా, నడిమంత్రపు సిరికలిగినా, కాలానికి అంతరాయం కలుగక మానుతుందా?

* * *

అది అరుణోదయకాలం. దినకరుని రజిత కిరణాలు ఆ పూలతోటయందలి మంచుబిందువులమీద పడి బంగారు ముత్యాలవలె మెరుస్తున్నై. పక్షిసంతానాలు మేతకై గూండ్లను విడిచి కిలకిలారావాలుచేస్తూ ప్రయాణాలుచేస్తూన్నవి. శ్రమజీవులు ఆతురతగా ఎవరి పనులకు వాళ్ళు పోతున్నారు. రైతులు నాగళ్ళు భుజాల మీదవేసుకొని ఎడ్లను తోలుకొని పొలానికి పోతున్నారు. ఆ వనమాత్రం అతి ప్రశాంతంగా వుంది. రకరకాల పూలమొక్కలనుండి రకరకాల పూలవాసనలు విరజిమ్ముతూన్నవి. వెంకయ్యగారు యిద్దరు ముగ్గురు అనుచరులతోటి ఉద్యానవన విహారానికి వచ్చేరు............ఏమండీ బావగారూ? మీ ఉద్దేశ్యమేమిటంటారూ! యిదంతా ఒక మోసమంటారా కాదా? లేకపోతే యీ బేపనోళ్లు మనల్ని యింత అధములుగా తీసిపారవేసేరు. వాళ్ళంతా కలిసి పన్నిన పన్నాగం. చూడండి మనం గుళ్ళోకి వెళ్ళకూడదూ! వెడితే దేవుడు మైలపడిపోతాడా! పెద్ద కులంవాళ్ళు మనల్ని ఎంత బాధపెట్టినా సహించి వుండాలా? ఇంక ఆ రోజులు సాగవు. ఏమంటారు సుబ్బనబావగారు. నిజంగా నాకు వీళ్లనుచూస్తే వళ్లు మండిపోతుంది" అన్నారు వెంకయ్యగారు......... "ఆ ఆ ఎంతమాట. బావగారుచెప్పిన మాటల్లో వీసమంతకూడా అబద్ధముంటుందీ? ఏమోనండి నాకు కూడా వాళ్లనుచూస్తే వళ్ళు మండుతుంది. యింక వాళ్ల ఆటలు సాగవులేండి. మీరు మన కులాన్ని వుద్ధరించటానికి పుట్టేరు" అన్నాడు ఒకాయిన. ఇలాగ చాలాసేపటివరకూ మాట్లాడుకుంటూ ఒక చోట కూర్చుండిపోయేరు.........దూరంగా ఒక ఎద్దు పూలతోటలోజొరపడి మొక్కలు తినివేస్తోంది. దూళ్లకాపరి, అంగలార్చుకుంటూ పరుగెత్తుకొచ్చి ఎద్దును మళ్లిస్తున్నాడు. ఇదంతా వెంకయ్యగారు చూచేరు. "ఒరేయ్ సుబ్బా. గాడిదికొడుకా యింత పొగరా? ఏంచేస్తున్నావ్ కళ్ళు మూసుకుపోయి యేడుస్తున్నావ్. ఎద్దు మొక్కలు తినివేస్తోంటే ఎక్కడ చచ్చేవు. పీనుగా తెగతిని పూరపందిలా బలిసేవు" అంటూ తోకత్రొక్కిన త్రాచులాగ మండిపడుతూ, చేతులోవున్న కర్రతీసుకొని దూళ్లకాపరిని రెండు దెబ్బలు కొట్టేరు. ఆ దెబ్బతిని "అయ్యబాబయ్యో చచ్చిపోయేనండి. కొట్టకండి బాబూ నా తప్పు చమించాల అపరాదం" అంటూ వెంకయ్యగారి కాళ్ళమీద పడ్డాడు. కాని, వెంకయ్యగారి కోపం తగ్గలేదు. ఇంకో రెండు దెబ్బలు కొట్టారు. "వెధవా నీ బాబుతో చెప్పుకో" అంటూ అవతలకు గెంటివేసేరు. పాపం ఆ దూళ్లకాపరి చచ్చితిని కన్నులొట్టపోయి బ్రతుకుజీవుడా యంటూ బయటపడ్డాడు. ఇదంతా చూస్తూన్న వెంకయ్యగారి అనుచరులు కిక్కురుమనలే. అడ్డువస్తే వాళ్లనుకూడా ఏంచేస్తాడో అన్న భయం. ఏలాగైనా డబ్బున్నవాడుకదండి మరి? ..............యింతలో తెల్లవారుతోంది.

* * *

"ఒరేవ్......వెంకా......ఓరీ నీనిద్ర కూలిపోనూ? లేవరా.........ఆరిపీనుగా.........ఎనిమిదిగంటల ప్రొద్దెక్కింది. దూడ పాలుత్రాగేస్తోంది. నియబ్బ ఎవడుచూస్తాడనుకున్నావు.........తత్తుకొడకా. ఏం వినపట్టంలే? యింత కుంభకర్ణుడినిద్రా" అంటూ కామందు వీరెడ్డిగారు కర్రతో రెండుసార్లు కొట్టి లేపేరు..............."ఆ...అబ్బ...దెబ్బ తగిలింది......ఎవరూ!......" అంటూ వులికిపడి లేచేడు వెంకడు. చాలా ప్రొద్దెక్కిపోయింది కామందు కోపంతో చిందులుత్రొక్కుతున్నాడు. వెంకడు దూళ్ళపాకలో వట్టిగడ్డిమీద పడుకునివున్నాడు. వళ్లంతా గోమారు ఎక్కి దురదపడుతోంది. తనకు దొరికిన ధనం, మేడ, ప్రెసిడెంటు పదవి, తాను తీర్పు చెప్పిన బ్రాహ్మణుడూ, తాను విహరిస్తోన్న వుద్యానవనం, తాను కొడుతోన్న పెలాడూ, ఏరి? యిదంతా వట్టి కల అనుకున్నాడు. "ఆ కలే నిజమైతే యీ కామందుచే యీలా దెబ్బలుతిందునా" అనుకున్నాడు. పాపం ఆ అభాగ్యుడు ఆ రాత్రంతా ఆ "స్వప్నవీధి" లో దారితెలియక చిక్కుపడ్డాడు.